క్లుప్తంగా

విజయవంతం చేయండి

మణుగూరురూరల్: ఏప్రిల్ 14వ తేదీన జరగబోయే కాంట్రాక్ట్ కార్మికుల హక్కుల పరిరక్షణ సంఘం ప్రథమ మహాసభలను విజయవంతం చేయాలని కోరుతూ ముద్రించిన గోడపత్రికలను ఆదివారం సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రాసూరి శంకర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సమస్యల పరిష్కారానికి, హక్కులు, హైపవర్ కమిటీ వేతనాల సాధనకు కాంట్రాక్ట్ కార్మికులందరూ ఐక్యంగా ఉద్యమించాలన్నారు. ఏప్రిల్ 14న జరిగే మహాసభలకు కాంట్రాక్ట్ కార్మికులు అధిక సంఖ్యలో తరలివచ్చి జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.యాకయ్య, నాయకులు సాధిక్‌పాషా, జయంత్, రాంచందర్, కె రాము,

హత్యాయత్నం కేసు నమోదు చేయాలి

ములకలపల్లి: ఆదివాసీ జేఏసీ నాయకుడు ఊకే ముక్తేశ్వరరావుపై దాడికి పాల్పడ్డ దుండగులపై హత్యాయత్నం కేసు నమోదు చేయాలని మానవ హక్కుల వేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎస్.తిరుపతయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం సీతారాంపురం గ్రామంలో సంఘ బృందం క్షేత్రస్థాయిలో పర్యటించి, వివరాలు సేకరించారు. ఈసందర్భంగా వారు మాట్లాడారు. సీతారాంపురం శివారులోని భూమిలో భూమిలేని నిరుపేదలు గుడిసెలు నిర్మించారని, ఈ విషయంలో కీలకపాత్ర వహిస్తున్న సదరు ఆదివాసీ జేఏసీ నాయకుడిపై కొందరు గిరిజనేతరులు దురుద్దేశపూర్వకంగా దాడికి తెగబడ్డారని అన్నారు. అన్యాయంగా ఆదివాసీ నాయకుడిపై దాడికి తెగబడ్డవారిపై హత్యాయత్నం కేసు నమోదు చేయాలని అన్నారు. సంఘ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బాదావత్ రాజు, ఖమ్మం జిల్లా కన్వీనర్ డి.ఆదినారాయణ, కో–కన్వీనర్ బి.రమేశ్, హనుమాన్ ప్రసాద్. వి.దిలీప్, వి.వెంకట నారాయణ, ఎస్.అచ్యుత్‌కుమార్ పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యే సంతాపం

మణుగూరురూరల్: మండలంలోని గుట్టమల్లారం గ్రామానికి చెందిన గన్నెర్ల మల్లికార్జున్ తల్లి రాజమ్మ, కొండాయిగూడెం గ్రామానికి చెందిన పల్లపు శంకర్, రైల్వేగేట్ కూనవరం ఏరియాకు చెందిన ఎల్లబోయిన శ్రీను తల్లి గోపమ్మలు మరణించగా.. విషయం తెలుసుకున్న పినపాక మాజీ ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు ఆయా గ్రామాలకు చేరుకుని వారి వారి మృతదేహాలను సందర్శించారు. పూలమాల వేసి ఘన నివాళ్లర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతిని తెలిపారు. సంతాపం తెలిపిన వారిలో ఉపసర్పంచ్ పుచ్చకాయల శంకర్, పాషా, సత్యంబాబు, కటుకూరి శ్రీనివాసరావు, పాతూరి వెంకన్న, దొడ్డపనేని మధుకుమార్, పూనెం చంద్రశేఖర్, గుడికందుల రాజేంద్రప్రసాద్, కట్టి నర్సింహ, తమ్మిశెట్టి సాంబ, సీతారాములు, వేమూరి కిరణ్, కుర్రి కృష్ణ, కుర్రి వెంకటనారాయణ, మడకం ముత్తయ్య, ఏనిక రామారావు తదితరులు ఉన్నారు.

ఆదివాసీలకు అన్నదానం

చర్ల: మండల కేంద్రమైన చర్లలో ఆదివారం జరిగిన వారపు సంతకు సరిహద్దు ప్రాంతం నుంచి వచ్చిన ఆదివాసీలకు చర్లలోని మేమున్నాం సహాయక కమిటీ ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు. చర్లలోని గాంధీ సెంటర్‌లో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో సంతకు వచ్చిన ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని బీజాపూర్, సుకుమా, దంతెవాడ జిల్లాలోని వివిధ మారుమూల ప్రాంతాల నుంచి వచ్చిన వారిలో సుమారు 300 మంది ఈ అన్నదానంలో పాల్గొన్నారు. దాత మరుచూరి మనోహర ప్రసాద్ సహకారంతో మేమున్నాం సహాయక కమిటీ చైర్మన్ నీలిప్రకాశ్ నేతృత్వంలో కార్యక్రమం కొనసాగింది. ఈ కార్యక్రమంలో ధనికొండ శ్రీనివాసరావు, పరిటాల వెంకటరమణ, ఉమ్మలేటి మల్లికార్జునరావు, ఎంఎస్ నాయుడు, ముమ్మనేని అరవింద్, గొట్టిపాటి శ్రీనివాసరావు, జవ్వాది మురళీకృష్ణ, దొడ్డి రమణారావు, మర్ల ప్రసాద్, దత్తు, రాజా, అజీజ్, ప్రభుదాస్, ఆర్‌వీ రమణ, అలవాల మురళీ తదితరులు పాల్గొన్నారు.

'హక్కులు కాలరాస్తున్న కేంద్రం'

భద్రాచలంటౌన్: కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానలకు నిరసనగా ఏప్రిల్ 5న నిర్వహించనున్న చలో ఢిల్లీ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు మచ్చా వెంకటేశ్వర్లు పిలుపునిచ్చారు. స్థానిక పార్టీ కార్యాలయంలో ఆదివారం జరిగిన పట్టణ ప్రజా సంఘాల సదస్సులో మాట్లాడారు.

బీజేపీ అధికారంలోకి వచ్చిన తరువాత కార్మికుల హక్కులను కాలరాస్తూ కార్మిక చట్టాలను 4లేబర్ కోడ్‌గా తీసుకొచ్చి నిర్వీర్యం చేస్తోందని విమర్శించారు. వ్యవసాయాన్ని కార్పొరేట్ సంస్థలకు అప్పచెప్పి వ్యవసాయ రంగాన్ని, రైతాంగాన్ని దివాలా తీయించేందుకు మోదీ ప్రభుత్వం కుట్ర చేస్తోందని ఆరోపించారు. ప్రజా సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించే ఛలో ఢిల్లీ కార్యక్రమం విజయవంతానికి గ్రామాల్లో విస్తృతంగా ప్రచారం చేయాలని కోరారు. ఈ సదస్సులో సీఐటీయు జిల్లా అధ్యక్షుడు కె.బ్రహ్మచారి, రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు యలమంచి వంశీకృష్ణ, గడ్డం స్వామి, ఎంబి.నర్సారెడ్డి, జ్యోతి, సీతాలక్ష్మి, లీలావతి, నాగరాజు, లక్ష్మణ్, గంగ, ప్రేమ్‌కుమార్, సతీస్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

కాలుష్య ఉత్పత్తి.. ఉత్పాదకత!

- బీటీపీఎస్, సింగరేణి నుంచి దుమ్మూధూళి..
- శ్వాసకోశ సంబంధిత వ్యాధుల బారిన ఉద్యోగులు, ప్రజలు
- ఆకు కూరల మొక్కలపై ప్రభావం
- చర్యలపై యాజమాన్యాల నిర్లక్ష్యం



బీటీపీఎస్‌లోని కోల్‌ప్లాంట్‌లో దుమ్ము..



సింగరేణిలో బొగ్గు నుంచి వెలువడుతున్న ధూళి

మణుగూరుటౌన్: పారిశ్రామిక ప్రాంతంగా అభివృద్ధి చెందిన మణుగూరు మండలం కాలుష్యం కోరల్లో చిక్కుకుంటోంది. అందుకు ప్రధాన కారణం మండల పరిధిలోని ప్రధాన పరిశ్రమలైన సింగరేణి, బీటీపీఎస్‌లు కాలుష్యంపై సరైన చర్యలు తీసుకోకపోవడమే. బొగ్గు ఉత్పత్తి చేస్తున్న సింగరేణి సంస్థ ఆ బొగ్గును రవాణా చేసే క్రమంలో బొగ్గు దుమ్ముధూళితో పరిసర ప్రాంతాలను కాలుష్యం చేస్తున్నాయి. ఆయా ప్రాంతాల్లో పనిచేసే కార్మికులు ఇబ్బంది పడుతున్నారు. అదే బొగ్గుతో విద్యుత్ ఉత్పత్తి చేస్తున్న బీటీపీఎస్ సైతం బొగ్గును విద్యుత్ కోసం వినియోగించే క్రమంలో బొగ్గు దుమ్ముధూళితో పరిసర గ్రామాలను ఇబ్బందులకు గురిచేస్తున్నారు. బీటీపీఎస్ వారు సైతం కాలుష్య నిర్మూళన చర్యలు సక్రంగా తీసుకోక పోవడంతో పరిసర ప్రాంతాల ప్రజలతోపాటు ఆయా ప్రదేశాల్లో పనిచేసే ఉద్యోగులు సైతం శ్వాస కోశసంబంధిత వ్యాదులతో ఇబ్బందులు పడుతున్నారు.

నల్లగా మారుతున్న చెట్లు..

మణుగూరు ఏరియా సింగరేణిలోని ఓపెన్‌కాస్టు గనుల పరిసర ప్రాంతాల్లో చెట్లు బొగ్గు దుమ్ము ధూళితో నల్లగా మారుతున్నాయి. ఇక్కడ కాలుష్యం ఏ మేరకు ఉందో ఇది స్పష్టం చేస్తోంది. బీటీపీఎస్ పరిసర ప్రాంతాలైన చిక్కుడుగుంట, సీతారామపురం, దమ్మక్కపేట, సాంబాయిగూడెం పరిసర ప్రాంతాలతోపాటు, రామానుజవరం గ్రామంల్లోని ఆకుకూరల తోటలు సైతం బొగ్గు దుమ్ముధూళితో నిండి ఉంటున్నాయి. చిమ్మినీల నుంచి వచ్చే బూడిద, యాష్‌ప్లాంట్ నుంచి వచ్చే బూడిదతో నిండిపోతున్నాయి. ఆయా గ్రామాల్లో చెట్లు, రామానుజవరంలోని ఆకుకూరల తోటలు సైతం దుమ్ముతో నిండిపోవడంతో ఆకుకూరలు సక్రమంగా ఉండటం లేదని ఆయా గ్రామాల ప్రజలు వాపోతున్నారు. తోటకూరలు గతంలో మాదిరిగా ఎదగడంలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

వాటర్ స్ప్రే చేయకపోవడంతోనే..

సింగరేణిలోని బొగ్గు రవాణా కోసం ఏర్పాటు చేసిన కోల్ హ్యాండ్లింగ్ ప్రాంతాల్లో సరిగా వాటర్ స్ప్రేచేయకపోవడం వల్ల బొగ్గుకు సంబంధించి దుమ్ముధూళి విపరీతంగా లేస్తోంది. బీటీపీఎస్‌లోనూ బొగ్గు నిలువ ప్రదేశంతోపాటు (కోల్ ప్లాంట్), కోల్ క్రషర్స్, ప్రదేశాల్లో సరైన వాటర్‌స్ప్రే లేకపోవడంతో దుమ్ముధూళి విపరీతంగా లేస్తుంది. ఇది గమనించాల్సిన అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో కాలుష్యంతో పరిసర ప్రాంతాలు నిండిపోతున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి దుమ్ము ధూళి ఎక్కువగా లేచే ప్రాంతాల్లో నిరంతరం వాటర్ స్ప్రేచేసి వాతావారణ కాలుష్యం లేకుండా చూడాలని పరిసర ప్రాంతాల ప్రజలతోపాటు ఆయా ప్రాంతాల్లో పనిచేసే ఉద్యోగులు కార్మికులు కోరుతున్నారు.

పటిష్టమైన చర్యలు తీసుకోవాలి



పరిశ్రమల్లో ఏర్పడుతున్న కాలుష్య నియంత్రణకు అధికారులు పటిష్టమైన చర్యలు తీసుకోవాలి. దుమ్ముధూళి లేవకుండా ఎప్పటికప్పుడు వాటర్‌స్ప్రే చేస్తూ తగిన చర్యలు చేపట్టాలి. ప్రధానంగా ఓసీల్లో రోడ్లపై ఎప్పుటికప్పుడు వాటర్ స్ప్రే చేయాలి. కోల్ ప్లాంట్స్‌లోను దుమ్ములేవకుండా చర్యలు తీసుకోవాలి.

– ఆర్.మధుసూదన్‌రెడ్డి, ఇఫ్టూ నేత, సాంబాయిగూడెం

సుదూర ప్రాంతాల వరకు..



బీటీపీఎస్ చిమ్మినీల నుంచి వచ్చే పొగతో దూరంలో ఉన్న రామానుజవరంలోని ఆకుకూరల తోటల్లో బూడిద పేరుకుంటోంది. ఉదయంలేవగానే ఆకుకూర తోటలు తెల్లటి బూడిదతో నిండుతున్నాయి. కోల్ ప్లాంట్ నుంచి వచ్చే బొగ్గు దుమ్మువల్ల పరిసర ప్రాంతాలైన చిక్కుడుగుంట గ్రామాలు మరింత కాలుష్యంతో నిండిపోతున్నాయి.

– జంప సీతారామరాజు, బీజేపీ నాయకుడు, రామానుజవరం

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ



బాధితురాలికి చెక్కు అందజేస్తున్న ఎంపీపీ, నాయకులు

దుమ్ముగూడెం: దుమ్ముగూడెం గ్రామానికి చెందిన కొత్తూరి శాంతాదేవి వైద్య ఖర్చుల నిమిత్తం ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా మంజూరైన చెక్కును ఎంపీపీ రేసు లక్ష్మి చేతుల మీదుగా ఆదివారం అందజేశారు.మంత్రి పువ్వాడ అజయ్ కుమార్, ప్రభుత్వ విప్ పినపాక శాసనసభ్యుడు, బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు రేగా కాంతారావు సిఫారసు ద్వారా ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి రూ.60 వేల చెక్కు మంజూరు కాగా.. దానిని బాధితురాలికి అందజేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు అన్నే సత్యనారాయణమూర్తి, ప్రధాన కార్యదర్శి కణితి రాముడు, నాయకులు ఎండి.జానీ పాషా, ఎంపీటీసీ సోడి తిరుపతిరావు, జెట్టి రామకృష్ణ, కొత్త మల్లేష్, కొత్తూరి సీతారామారావు, సీతారామారావు కెల్లా శేఖర్, మోతుకూరి శ్రీకాంత్, కొప్పుల సాగర్ తదితరులు పాల్గొన్నారు.

అశ్వాపురం: ప్రభుత్వ విప్, పినపాక ఎమ్మెల్యే రేగా కాంతారావు సిఫారసు మేరకు మండల పరిధిలోని జగ్గారం గ్రామానికి చెందిన ఎల్లావుల సంతోష్‌కు రూ.28వేలు, అశ్వాపురానికి చెందిన రాయల సత్యనారాయణకు రూ.60 వేలు, తురుములగూడెం గ్రామానికి చెందిన కుసుమకు రూ.49 వేలు ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులు మంజూరయ్యాయి. వాటిని బీఆర్‌ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు కోడి అమరేందర్ ఆధ్వర్యంలో ఆదివారం లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి అందజేశారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ వీరభద్రం, సర్పంచ్ సున్నం రాంబాబు, ఉపసర్పంచ్ ఆవుల వెంకన్న, నాయకులు దైదా నారాయణరెడ్డి, కందుల కృష్ణార్జున్‌రావు, చిలకా వెంకటరామయ్య, దావా వీరస్వామి, లంకెల రమేష్, షేక్ నయీం, జిలాని, నాగ, జూపల్లి కిరణ్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

గ్యాస్ ధర పెంపుపై నిరసన



ఆందోళన నిర్వహిస్తున్న ప్రజాసంఘాల నాయకులు, మహిళలు

చర్ల: హిందువుల సంక్షేమం అంటే ప్రజలపై ధరలు పెంచి భారాలు వేయడమేనా అని ప్రజాసంఘాలు ప్రశ్నించాయి. వంటగ్యాస్ ధరల పెంపును నిరసిస్తూ సీఐటీయూ ఆధ్వర్యంలో వ్యవసాయ కార్మిక సంఘం, కేవీపీఎస్, ఆటోవర్కర్స్ యూనియన్ సంఘాలు వంటగ్యాస్ ధరల పెంపును నిరశిస్తూ చర్లలోని అంబేడ్కర్ సెంటర్‌లో కట్టెలమోపులతో ఆందోళన నిర్వహించాయి. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు కొలగాని బ్రహ్మచారి మాట్లాడుతూ.. రూ.450 లు ఉన్న వంట గ్రాస్ ధర కేంద్రంలో నరేంద్రమోదీ అధికారంలోకి వచ్చిన తరువాత రూ.1200కు పెరిగిందని అన్నారు. ప్రతి గ్యాస్ బండపై రూ.750 భారం వేసి ప్రజానీకాన్ని దోపిడీకి గురి చేస్తోందని విమర్శించారు. కేంద్రం తన వైఖరిని వెంటనే మార్చుకోవాలని పెంచిన వంటగ్యాస్ ధలను వెంటనే తగ్గించాలని ఆయన డిమాండ్ చేశారు. నిరసన కార్యక్రమంలో కేవీపీఎస్ మండల కార్యదర్శి మచ్చా రామారావు, ఐద్వా మండల కమిటీ కార్యదర్శి సీ సమ్మక్క, వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి బందెల చంటి, అధ్యక్షురాలు విజయశీల, సీఐటీయ మండల కాయకులు శ్యామల వెంకటేశ్వర్లు వార్డు సభ్యులు దొడ్డి హరినాగవర్మ, ఆటోవర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు పామారు బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

'కంటి వెలుగు'లో పరీక్షలు



మహిళకు కళ్లజోడు అందజేస్తున్న వైద్యాధికారి శివకుమార్

మణుగూరురూరల్: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన రెండో దఫా కంటివెలుగు పథకం మణుగూరు మండలంలో విజయవంతంగా కొనసాగుతోంది. జనవరి 19న ప్రారంభమైన కంటివెలుగు పథకం.. మణుగూరు మండలంలోని అర్బన్, రూరల్ ప్రాంతాల వారీగా పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ శివకుమార్, ఎంపీడీఓ వీరబాబు పర్యవేక్షణలో నేత్ర వైద్యాధికారి జి.సంజీవరావు ఆధ్వర్యంలో, మున్సిపాలిటీలో కమిషనర్ మురళీకృష్ణ పర్యవేక్షణలో దిగ్విజయంగా సాగుతోంది. ఆదివారం వైద్యాధికారి శివకుమార్ పలు కంటివెలుగు శిబిరాలను సందర్శించి పరీక్షల నిర్వహణను పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇప్పటి వరకు 93 శిబిరాల ద్వారా 11,119 మందికి కంటివైద్య పరీక్షలు నిర్వహించగా..2,831మందికి కళ్లజోళ్లను పంపిణీ చేసినట్లు తెలిపారు. మండల వ్యాప్తంగా నిర్వహిస్తున్న కంటివెలుగు శిబిరాలను ఆయా ప్రాంతాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. 18 సంవత్సరాలు పైబడిన ప్రతి ఒక్కరినీ కంటివెలుగు శిబిరాలకు తరలించి పరీక్షలు చేయించేలా ఏఎన్ఎంలు, ఆశావర్కర్లు, అంగన్‌వాడీ టీచర్లు కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో డాక్టర్ దినేష్, డాక్టర్ శివరాజ్, డాక్టర్ లావణ్య, నేత్ర వైద్యాధికారులు దివ్య, ప్రశాంత్, రాజేష్, డేటా ఎంట్రీ ఆపరేటర్స్, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

పొదుపుగా వాడుకోవాలి

అశ్వాపురం: తుమ్మలచెరువు నీటిని రైతులు పొదుపుగా వాడుకోవాలని మొండికుంట సర్పంచ్ మర్రి మల్లారెడ్డి అన్నారు. ఆదివారం ఆయన రైతులతో కలిసి తుమ్మలచెరువును సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆయకట్టు పరిధిలో కుందారం, చదలవాడ కాలువల కింద 2 వేల ఎకరాల్లో రబీలో రైతులు వరి సాగు చేస్తున్నారన్నారు. చెరువులో ప్రస్తుతం నీరు 12 అడుగులు మాత్రమే ఉన్నందున రైతులు నీరు వృథా చేయకుండా చివరి ఆయకట్టు వరకు నీరు అందే విధంగా చూడాలన్నారు. వంతుల వారిగా పొలాలకు నీరు పెట్టుకోవాలని సూచించారు.

7న వేంకటేశ్వర కల్యాణం

చర్ల: మండలంలోని లక్ష్మీకాలనీ గ్రామపంచాయతీ దేవానగరంలో ఉన్న వేంకటేశ్వర దేవాలయంలో ఈ నెల 7న జరిగే అలివేలు, భూదేవి అమ్మవార్ల సహిత వెంకటేశ్వరస్వామి కల్యాణ మహోత్సవానికి భక్తులు వేలాదిగా తరలిరావాలని ఆలయ కమిటీ కోరింది. ఈ మేరకు కమిటీ ఆదివారం ఓ ప్రకటన విడుదల చేసింది. మంగళవారం మధ్యాహ్నం 12 గంటలకు కల్యాణం, 1.00 గంటకు అన్నదానం, సాయంత్రం 4.00 గంటలకు స్వామి వారి ఊరేగింపు కార్యక్రమాలు కొనసాగుతాయని కమిటీ పేర్కొంది. 11న ఉదయం 10.00 గంటలకు నాగవెల్లి కార్యక్రమంతో పాటు అన్నదానం నిర్వహించనున్నామని కమిటీ వెల్లడించింది.

పవన్ నాయక్‌కు సన్మానం

మణుగూరురూరల్: భారత జాగృతి జిల్లా అధ్యక్షుడిగా నియమితుడైన పవన్ నాయక్ ఆదివారం ప్రభుత్వ విప్, పినపాక ఎమ్మెల్యే రేగా కాంతారావు స్థానిక క్యాంప్ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రేగా కాంతారావు పవన్ నాయక్‌కు శాలువాతో సన్మానించి.. పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పనులకు శంకుస్థాపన

చంద్రుగొండ: మండలంలోని తుంగారం పంచాయితీ జర్పులతండాలో సీసీరోడు పనులకు సర్పంచ్ బాణోత్ కుమారి ఆదివారం శంకుస్థాపన చేశారు. ఎన్ఆర్‌ఈజీఎస్ పథకం ద్వారా రూ.5 లక్షలు నిధులు మంజూరయ్యాయి. సదరు నిధులతో రోడ్డు పనులకు శ్రీకారం చుట్టారు. కార్యక్రమంలో బాణోత్ భీలునాయక్ గ్రామస్తులు పాల్గొన్నారు.

అగ్నిమాపక కేంద్రం ఏర్పాటు చేయాలి

చంద్రుగొండ: మండలకేంద్రం చంద్రుగొండలో అగ్నిమాపకకేంద్రం ఏర్పాటు చేయాలని తుడుందెబ్బ రాష్ట్ర కార్యదర్శి కాక మహేష్ ప్రభుత్వాన్ని ఆదివారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. ఇటీవల కాలంలో మండలంలో అగ్నిప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. సుబాబులు, జామాయిల్ పంటలు ప్రమాదవశాత్తు అగ్నికి ఆహుతి అవుతున్నా రక్షించుకునే పరిస్థితి లేదన్నారు. సత్తుపల్లి, కొత్తగూడెం నుంచి అగ్నిమాపక శకటాలు వచ్చే సరికి నష్టం జరిగిపోతుందన్నారు. ప్రభుత్వం సత్వర చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలి



మాట్లాడుతున్న విప్ రేగా కాంతారావు

మణుగూరుటౌన్: పెరికకులస్తులు అన్నిరంగాల్లో అభివృద్ధి చెందాలని తెలంగాణ ప్రభుత్వ విప్ పినపాక ఎమ్మెల్యే రేగా కాంతారావు అన్నారు. ఆదివారం మణుగూరు మండలంలోని శివలింగాపురం సాయిరాం ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన పురగిరి క్షత్రియ పేరిక సంఘం సమావేశంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. పేరిక సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తుందన్నారు. పూర్వం పెరికలకు జనపర వృత్తి కుల వృత్తిగా ఉండేదన్నారు. నేడు అది లేదన్నారు. కేవలం చదువే సాధనంగా ముందుకు సాగుతున్నారన్నారు. సీఎం కేసీఆర్ నేతృత్వంలో తెలంగాణ రాష్ట్రం అన్ని విధాలుగా అభివృద్ధి చెందుతుందన్నారు. సీఎం కేసీఆర్ అన్ని వర్గాల సంక్షేమానికి ప్రత్యేక చర్యలు చేపట్టిందన్నారు. పెరిక సంఘం అభివృద్ధికి తన సహకారం ఎల్లప్పుడు ఉంటుందన్నారు. కార్యక్రమంలో పెరిక సంఘం నాయకులు చిట్టి మల్లేష్, డాక్టర్ మదుసూదన్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

మణుగూరురూరల్: సీఎం రిలీఫ్ ఫండ్ నిధులు ద్వారా నిరుపేదల జీవితాల్లో వెలుగులు నిండుతున్నాయని పినపాక ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ రేగా కాంతారావు అన్నారు. మండల పరిధిలోని విజయనగరం గ్రామానికి చెందిన రావుల యాకయ్యకు ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా మంజూరైన రూ.50వేల చెక్కును ఆదివారం స్థానిక క్యాంప్ కార్యలయంలో ఎమ్మెల్యే రేగా కాంతారావు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఎంతోమంది నిరుపేదల వైద్య ఖర్చుల నిమిత్తం సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా ఆర్థిక సహాయం అందిస్తోందన్నారు. ఆర్థిక స్తోమత లేని పేద ప్రజలందరూ సీఎంఆర్‌ఎఫ్‌ను వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

సైక్లింగ్‌తో మహిళలకు ఉపయుక్తం



చంద్రుగొండ: మహిళలకు సైక్లింగ్ కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న యాస్మిన్

చంద్రుగొండ: ఆయుష్మాన్ భారత్ హెల్త్ అండ్ వెల్‌నెస్ కార్యక్రమంలో భాగంగా మండలంలోని తుంగారం గ్రామంలో ఆదివారం మహిళలతో సైక్లింగ్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. చంద్రుగొండ ప్రాథమిక ఆరోగ్యకేంద్రం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో వైద్యశాఖ ఎంఎల్‌హెచ్‌పీ మహ్మద్ యాస్మీన్ మాట్లాడుతూ.. శారీరకంగా మానసికంగా ఎంతో ఉల్లాసం కలిగించే కార్యక్రమం మహిళలకు ఉపయుక్తంగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ యండి.ఇమాం, వైద్యసిబ్బంది, ఆశావర్కర్లు యం.అరుణ, కె.అరుణ, వి.శిరోమణి, సరోజిని, వెంకటలక్ష్మి, ఈ సీతమ్మ, లక్ష్మి పాల్గొన్నారు.

మొద్దులగూడెంలో సైకిల్ ర్యాలీ

దమ్మపేట: అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని మండలపరిధిలోని మొద్దులగూడెం గ్రామంలో ఆదివారం సైకిల్ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ డి. సుజాత మాట్లాడారు. బాలికా హక్కులపై వివరించారు. యుక్తవయసు పిల్లలు తీసుకోవాల్సిన ఆరోగ్య జాగ్రత్తలను వివరించారు.

పుడమితల్లికి పసుపు పూసినట్టు..



పసుపు పచ్చని పూలతో జనుము చేను

దుమ్ముగూడెం: పుడమితల్లికి పసుపు పూసినట్టు పచ్చటిపూలతో చూడముచ్చటగా ఆహ్లాదకరంగా ఉన్న జనుము చేను మొత్తం పచ్చని పూలతో సుందరంగా కనిపిస్తోంది. మండలంలోని భద్రాచలం –చర్ల ప్రధాన రహదారి పక్కన ఉన్న నడికుడి గ్రామ శివారులో ఈ చేను ఉంది. ప్రకృతి ప్రియులు అక్కడ ఆగి ఆ పచ్చని తోటలో సెల్ఫీలు, ఫోటోలు దిగుతున్నారు. ఈ సుందరమైన దృశ్యాన్ని 'సాక్షి'తన కెమెరాలో బంధించింది.

మతోన్మాదంపై పోరాడుదాం



వాల్‌పోస్టర్లు ఆవిష్కరించి మాట్లాడుతున్న కొండా చరణ్

చర్ల: ఆర్ఎస్ఎస్, బీజేపీ చేస్తున్న కుట్రలను తిప్పికొడదామని, మతోన్మాదానికి వ్యతిరేకంగా ఐక్య పోరాటాలు నిర్మిద్దామని సీపీఐ (ఎంఎల్) ప్రజాపంథా చర్ల మండల కార్యదర్శి కొండా చరణ్ పిలుపునిచ్చారు. మార్చి 10న రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌లో రవన్న స్మారక ఉపాన్యాసాలను నిర్వహిస్తున్న నేపథ్యంలో ఆ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఈ మేరకు ముద్రించిన వాల్‌పోస్టర్లను స్థానిక పార్టీ కార్యాలయంలో ఆదివారం ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కొండా చరణ్ మాట్లాడారు. దేశంలో ఒక పక్క పేదరికం నిరుద్యోగం అసమానతలు పెరిగిపోతున్నాయని, మరో పక్క మతోన్మాదం పెట్రేగిపోతూ మత విద్వేశాలు పెరిగిపోతున్నాయని అన్నారు. తినే తిండి, ఒంటికి కట్టే బట్ట, మత విశ్వాసాల మీద నిషేధాలు కొనసాగుతున్నాయని ఆయన అన్నారు. మొత్తంగా సాతంత్ర్యం వచ్చిన అనంతరం సంపాధించుకున్న రాజ్యాంగాన్నే కాదని బీజేపీ, ఆర్ఎస్ఎస్‌లు మనువాధాన్ని నిర్మించేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయని ఆయన ఆరోపించారు. ఈ పరిస్థితుల్లో ప్రజలు, ప్రజాస్వామిక వాదులు, స్వచ్ఛంద సంస్థలు ఐక్యం కావాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు ఎం.శివ, తడికల పవన్, బాలు, ముత్తయ్య, నరేష్, దేవా పాల్గొన్నారు.

ఆశయ సాధనకు కృషి చేయాలి

దుమ్ముగూడెం: సీపీఐ (ఎంఎల్) కేంద్ర నాయకుడు రాష్ట్ర కార్యదర్శి రవన్న సుభాష్ చంద్రబోస్ ఆశయ సాధనకు ప్రతి కార్యకర్తా కృషి చేయాలని మండల కార్యదర్శి సాయన్న పిలుపునిచ్చారు. ఆదివారం మండలంలోని గంగారం గ్రామంలో రవన్న ఏడో వర్ధంతి సభ జయప్రదం చేయాలని గోడ పత్రికలు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రవన్న విద్యార్థి దశ నుంచి పీడిత తాడిత ప్రజల కోసం ఉద్యమాలు నడిపించాడని అన్నారు. ఈ నెల 10వ తేదీన హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగే 7వ వర్ధంతి సభను జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రజాపంథా మండల నాయకులు నూప అర్జున్, కోసం చిన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

అటెన్షన్ ప్లీజ్

ప్రమాదకరంగా మలుపు



మండలంలోని లక్ష్మీనగరం గ్రామంలోని స్టేట్‌బ్యాంక్ దగ్గర ఉన్న మూలమలుపు ప్రమాదకరంగా మారింది. భద్రాచలం-చర్ల ప్రధాన రహదారిపై నిత్యం వందలాది వాహనాలు ప్రయాణిస్తుంటాయి. ఇక్కడే స్టేట్‌బ్యాంక్, ప్రైవేట్ పాఠశాలలు ఉన్నాయి. ఇలాంటి మూలమలుపు దగ్గర ఎటువంటి హెచ్చరిక బోర్డులూ ఏర్పాటు చేయలేదు. దీంతో ప్రజలు భయంతో బిక్కుబిక్కుమంటున్నారు. ప్రమాదాలు చోటుచేసుకోకముందే ఆర్అండ్‌బీ అధికారులు స్పందించి హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు. – దుమ్ముగూడెం

ప్రశ్నించాల్సిన అధికారి: హరిలాల్, ఆర్అండ్‌బీ డీఈ, భద్రాచలం
ఫోన్ నంబర్: 9440818414